

# పరదేశీ కథలు

## - లలిత చిట్టే



-74 -

## ఎడారిలో ఎండిన గుండె♡

"**హేయ్**.. సలీమా.. ఓ సలీమా.. ఎక్కడ చచ్చావే తొందరగా ఇలారా" గావు కేకలు పెట్టింది షేకా నూరా.

మామా కేకలకు భయపడిపోయి తినే అన్నాన్ని ప్లేటులో అలాగే వదిలేసి చెయ్యి కడుక్కుని బయటకి పరిగెత్తింది సలీమా.

"ఎన్ని సార్లు పిలిచాను నిన్ను. ఏం చేస్తున్నావు నువ్వు" గుడ్లురిమి చూసింది మామా.

వళ్ళంతా వణికిపోతుంటే తడబడే నోటిని పెకిలించుకుని "మామా అన్నం తింటున్నాను" అంది సలీమా.

"నీకు పని తక్కువ అన్నం తినడం ఎక్కువ. ఎంతసేపు తింటావు అన్నం. ఇదిగో ఈ రాక్ లో వున్న చెప్పులను శుభ్రంగా తుడువు" అంటూ గోడ వారగా నిలబెట్టిన రాక్ ను చూపుడు వేలితో చూపించింది.

"అలాగే మామా" అంది వినయంగా సలీమా.

"నేను స్నానం చేసి వచ్చేలోపల నువ్వు ఈ రాక్ ను చెప్పులను అందంగా అమర్చి పెట్టాలి" అంటూ స్నానం చెయ్యడానికి లోపలికి వెళ్ళిపోయింది మామా నూరా.

లోపల వదిలేసి వచ్చిన అన్నం గిన్నె గుర్తొచ్చి ఉసూరుమంది సలీమా ప్రాణం. కడుపు ఆకలితో కరకరలాడింది. ఒక్క క్షణం వంట గదిలోకి వెళ్ళి గిన్నెలోని అన్నాన్ని తొందరగా తినేసి వద్దామా అని ఆలోచించి మామా చూస్తే జరిగే పర్యవసానం గుర్తొచ్చి తల విదిలించి ఆ ప్రయత్నాన్ని విరమించుకుని పనిలో పడింది.యంత్రంలా చెప్పులను తుడుస్తోందే కానీ మనసు మాత్రం బాధతో మూలుగుతూనే వుంది. ఆకలితో ఆక్రోశిస్తోనే వుంది.

ఇంతలో శ్రీలంక వంటమనిషి హాల్లోకి వచ్చి తొంగి చూసి సలీమా చేస్తున్న పని చూసి చిన్నగా నవ్వుకుని పైకి మాత్రం "నువు వదిలేసిన అన్నం పడేయనా" అని అడిగింది.

"ఆ.. గిత్తి సిబాలా (చెత్త బుట్టలో పడెయ్యి) "అని బదులు చెప్పి తన పనిలో నిమగ్నమయ్యింది సలీమా.

అసహాయంగా చిక్కుకుపోయిన తన స్థితికి తన మీద తనే జాలి పడుతూ గయ్యాళి అయిన మామా మీద నయవంచకురాలైన ఆ శ్రీలంక వంటమనిషి మీద కోపాన్ని కసిని పెంచుకోసాగింది సలీమా.

సలీమా అసలు పేరు చంద్రమ్మ. కానీ కువైట్ కు వచ్చాక మామా 'సలీమా' అని పేరును మార్చేసి ఇక నుండీ ఇదే నీ పేరు అని చెప్పింది. తలకు చుట్టుకునే రెండు గుడ్డలనిచ్చి "తల వెంట్రుకలు కనబడకుండా తలకు చుట్టుకో. ఈ గుడ్డలు తలకు కట్టుకోకుండా పరాయి మగవాడి ముందుకు వెళ్ళకు ఇకనుండీ నువు ముస్లింవి. అల్లాయే మనకు దేవుడు" అంది.

భయంతో ఏమీ మాట్లాడలేక 'అలాగే' అంటూ తల వూపింది చంద్రమ్మ. ఇక అందరూ సలీమా అంటూ అదే పేరుతో పిలవడంతో ప్రస్తుతం తన అసలు పేరును కూడా మరిచిపోయే స్థితిలో వుంది చంద్రమ్మ. పగలు మామాతో పని బాధలు, రాత్రయితే శ్రీలంక దానితో వేరొక బాధలు భరించలేకపోతోంది సలీమా.

పగలంతా తిండి కూడా లేకుండా బొంగరంలా తిరుగుతూ కష్టపడి పని చేసి రాత్రి పూట శ్రీలంక దానితో నిద్ర లేక సరిపోక కృశించిపోతోంది సలీమా. తన బాధను ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. ఎవరికైనా చెపితే ఏమంటారో. జరిగేది తెలిస్తే ప్రాణం తీసేస్తారేమో. ఒక్క క్షణం గుండె వణికింది. కన్నీరు తొణికి చెంపలపైకి జారింది. ఇలాంటి స్థితి పగవాడికి కూడా రాకూడదు అనుకుంది మనసులో. తిండీ తిప్పలతో పాటూ నిద్ర కూడా సరిగ్గా లేకపోవడంతో ఆమె దేహం రోజురోజుకూ శుష్కించి పోతోంది.

ఎంతగా వేడుకున్నా ఎంత ప్రార్థించినా ఏ దేవుడూ ఆమె మొర ఆలకించడం లేదు.నిస్సహాయత ఆమెలోని అణువణువునా పేరుకుపోతుంటే ఏదో చేయాలన్న నిశ్చయంతో ఆమెలోని క్రోధం తలకెక్కుతోంది. మరి పర్యవసానమేమిటో కాలమే నిర్ణయించాలి.

రాత్రవుతోందంటే భయం. చెప్పలేనంత దిగులు. తన మీద తనకే అసహ్యం. వంటిపైన తేళ్ళూ జెర్రులూ పారాడుతున్న భావన. స్నానం చేసినా శరీరం పాపపంకిలమై చెత్తబుట్టలా మారి మురికి కంపు గొడుతున్నట్లుంది. పరిష్కారం ఏమిటి? ఎలా? ఈ పంజరం నుండి ఎడారి బిగించిన కబంధ హస్తాలనుండి తప్పించుకుని పోగలదా. నిత్యం జుగుప్సాకరంగా వంటిని తడిమి తారాడే స్పర్శతో సగం చచ్చిపోయి వుందామె. మెదడు కూడా మొద్దు బారిపోయి వుంది.  ఇలాంటి సమయంలో తప్పించుకునిపోయే ఆలోచనలు ప్రణాళికలు ఎలా వస్తాయి. ఇలాగే గడిస్తే కొద్ది రోజుల్లో చచ్చి శవమై పోవడం తథ్యం. కనీసం శవాన్నైనా ఇంటికి పంపిస్తారా ఇక్కడే ఎడారి ఇసుకలో తోసి కప్పెడతారా? ఎంత దౌర్భాగ్యం.

అనవసరంగా బ్రతుకును బలి చేసుకోవడానికే ఇంత దూరం కువైట్ కి వచ్చినట్లుంది. అక్కడే ఇండియాలో

ఇంటిదగ్గర వుండి ఒకపూట చద్దినీళ్ళు తాగి కడుపు నింపుకొని వున్నా బావుండేది. దినారాల మీద ఆశతో గల్ఫ్ దేశానికి పరిగెత్తి వచ్చి బ్రతుకుకే ముప్పును తెచ్చుకుంది. ప్రతిరోజూ మెడ మీద కత్తి నిలబడి వుంటే ఇక్కడ జీవించడం ఎలా?

ఆమె ఆలోచనల ప్రవాహంలో అలా కొట్టుకుపోతూ తలవంచుకుని చెప్పులను తుడుస్తుండగానే మామా నూరా వచ్చేసింది. వచ్చీ రాగానే వెనుకనుండి వీపు మీద కాలితో ఒక్క తన్ను తన్నింది.

"ఏమే నీకు కళ్ళు కనిపించడం లేదా? ఏం చేస్తున్నావో అర్థం అవుతోందా? చెప్పులన్నీ అస్థవ్యస్తంగా అమర్చావే" అని అరిచింది.

దెబ్బకు ఉలిక్కిపడి తేరి చూసింది సలీమా. తన్ను తిన్న నొప్పికి కంట్లో నీళ్లు పొంగి పొరలాయి. నిజమే ఆలోచిస్తూ చెప్పులన్నిటినీ జతగా కాకుండా అటూ ఇటూ వేరే స్థానంలో పెట్టింది. ఇక ఏమి జవాబు చెప్పాలో తెలియక బేల చూపులు చూసింది.

"హేయ్ మాలా" వంటమనిషిని పిలిచింది మామా.

పరిగెత్తుకుంటూ హాల్లోకి వచ్చింది శ్రీలంక వంటమనిషి మాలా.

"దీనికి బాగా కొవ్వెక్కింది. కన్నూ మిన్నూ కానరావడం లేదు. ఏ పనీ సరిగ్గా చెయ్యడం లేదు. ఈ రాత్రికి దీనికి అన్నం పెట్టకు కొవ్వు దిగుతుంది" అని చెప్పి కోపంగా వెళ్ళిపోయింది మామా. మామా అటు వెళ్ళగానే దగ్గరికి వచ్చింది మాల. సలీమాను దగ్గరికి లాక్కుని బుగ్గలపై వున్న కన్నీటిని తుడిచి ముద్దులు పెట్టింది.

"భయపడకు నీకు నేనున్నాగా. తెలుసుగా నా మాట వింటే నీకు అన్నం పెడతాను. నిను బుజ్జగిస్తాను" అంటూ తన రెండు చేతుల్తో సలీమాను బంధించి వళ్ళంతా తడమసాగింది. వదిలించుకోవడానికి గట్టిగా పెనుగులాడింది సలీమా. కానీ సరిగ్గా తిండి తినక నీరసించి వున్న ఆమె శక్తి రాక్షసి లాంటి శ్రీలంక వంటమనిషి దగ్గర ఎందుకూ పని చెయ్యలేదు.

"ప్రేమగా దగ్గరికొస్తే గింజుకుంటావెందుకు ఇష్టంగా నన్ను అల్లుకుపోవచ్చుగా" అంటూ లాగిపెట్టి చెంపపైన కొట్టింది మాల.

దెబ్బకు కళ్ళు తిరిగి తూలిపడబోయింది సలీమా.

ఇదే అదనుగా భావించి సలీమాను చుట్టుకుని వంటింట్లోని ఫ్రిజ్ పక్కన వున్న మూలకి లాక్కుపోయింది మాల. ఇక అక్కడ మాల ఏం చేసినా ఎదురు చెప్పలేకపోయింది సలీమా. ఎంతో అసహ్యంగా వున్నాసరే మాల చేష్టలను చేతలను ఆమె మౌనంగా భరించసాగింది. అప్పటివరకూ స్త్రీ పురుషుల సంగమమే ఆమెకు తెలుసు. ఇప్పుడిలాంటిది ఒకటి వుంటుందనీ.. ఇలాంటివి జరుగుతాయని కూడా ఆమెకు తెలియని సలీమా మాల చేతుల్లో

ఒదిగిపోయి వంట్లో ప్రాణముండగానే చచ్చిపోతోంది.

దెబ్బలుతిని తిండిలేక పని ఎక్కువై మాల ప్రవర్తనతో అలసిపోయి నీరసం నిలువెల్లా నిండిపోగా సలీమా ప్రాణం అలసిపోయింది. ఏ కళనుందో మాల మామా చూడకుండా కాస్త అన్నం తెచ్చి సలీమాకు పెట్టింది.

మామా తన్నులు కాదు కానీ మాల వికృతమైన చేష్టలు ప్రవర్తనా జుగుప్సాకరమైన స్పర్శా గుర్తొచ్చి అన్నం తినబుద్ది కాలేదు సలీమాకు.ఏదో నాలుగు ముద్దలు తిన్నా అనిపించింది.

"అలసిపోయావు కదా వెళ్ళి నా రూములో నా బెడ్డుపైన పడుకో. నేను వచ్చి నీకు వళ్ళంతా మసాజ్ చేస్తాను" ఆజ్ఞాపించినట్లు చెప్పింది మాల.

ఇక ఈ రాత్రికి కూడా శ్రీలంకది తనను విడిచి పెట్టదనీ మసాజ్ పేరుతో తనతో కసితీరా ఆడుకుంటుందనీ అర్థం చేసుకుని వణికిపోయింది సలీమా.

అప్పటికే మాల మంచంపై కన్నీటితో కరిగిన ఎన్నో కాళరాత్రులను అనుభవించింది సలీమా. జరగబోయే విపత్తును తలచుకుంటూ బలి పశువులా భారంగా మాల రూములోకి నడిచింది సలీమా.

కాసేపటికి ఆపిల్ పండ్లు తీసుకుని నవ్వుతూ గదిలోకి వచ్చింది మాల. సలీమా పక్కన కూర్చుని ప్రేమగా ఆమె ముంగురులను సవరిస్తూ "ఎందుకు ఎప్పుడూ ఏడుస్తూ వుంటావు. ఇక్కడ ఈ ఇంట్లో వున్నది మనమిద్దరమే. నా మాట విని నాకు సహకరిస్తే మనం ప్రతిరోజూ ఇష్టమొచ్చినట్లు తిని హాయిగా గడుపుతూ స్వర్గంలో విహరించ వచ్చు. కాలాన్ని కన్నీళ్ళతో వ్యర్థం చెయ్యకు" అంది.

భయంగా చూసింది సలీమా. పులినోట చిక్కిన జింక పిల్లలా వుంది ఆమె పరిస్థితి. దగ్గరికి జరుగుతున్న మాల ఆకలి గొని మీదపడి నోటకరుచుకుని పోయే పులిలా కనిపిస్తోంది.

ఉక్కిరిబిక్కిరి అయిపోతోంది సలీమా. మీద పడిన మాల మసాజ్ చేస్తానంటూ వంటిపైనున్న ఒక్కో వస్త్రాన్నీ తొలగిస్తోంది. ఓపిక నశించిపోతోంది. సలీమా పంటిబిగువున భరిస్తోంది దు: ఖం. ఎన్నాళ్ళిలా భరించడం? ఏదో తెగింపు ధైర్యం తోసుకుని వచ్చాయి.

సలీమా మానసిక స్థితిని గమనించే స్థితిలో లేదు మాల. తన ధోరణిలో దృష్టిని కేంద్రీకరించి తన పని తాను చేసుకుపోతోంది. మంచి మూడ్లో వుంది మాల. అంతవరకూ సలీమాలో నిద్రాణమై వున్న చంద్రమ్మ నిదురలేచింది. కళ్ళతోటే చుట్టూ పరిశీలించి చూసింది.

కిటికీలకు కర్టెన్నును కట్టి పెట్టే ఇనుప తంతి ఒకటి చంద్రమ్మ కంటికి కనపడింది.

అప్పటికే మాల వళ్ళు తన వశంలో లేదు. సలీమా వంటిని స్పర్శిస్తూ ఏదో మైకంలో మత్తులో తేలి ఆడుతోంది.

తనపైన వున్న మాలను విదిలించుకుని ఒక్కుదుటున పైకి లేచింది చంద్రమ్మ. పరిగెత్తి మూలన వున్న ఇనుప కమ్మీని చేతిలోకి తీసుకుంది. ఈ లోపల ఏమయిందో తెలుసుకోవాలని పైకి లేచింది మాల.

అంతే మాల తలపై బలంగా వేసింది వేటు.

అలా తనలో ఇన్నాళ్ళూ దాగి వున్న కోపాన్ని వెళ్ళగక్కుతూ దెబ్బపై దెబ్బను వేస్తూనే వుంది చంద్రమ్మ.

మాల పెట్టిన గావుకేకలను విని ఎక్కడో లోపల గదిలో వున్న మామా పరిగెత్తుకొని వచ్చింది.

రౌద్రంగా ఆది పరాశక్తిలా చేతిలోని ఇనుప కమ్మీతో నిలబడి వున్న చంద్రమ్మను చూసి భయపడి ఒక్కడుగు వెనక్కి వేసింది మామా నూరా.

అన్ని రోజులూ మామాను చూస్తే భయపడి వణికిపోయే చంద్రమ్మ ఇప్పుడు ఆవేశంగా ముందుకు అడుగులు వేసింది. అంతే చేతిలోని ఇనుప కమ్మీ విసురుగా మామా తలపై పడింది. అంతవరకూ అన్నేళ్ళుగా నరనరాల్లో నిండి ఉన్న కోపం అణువణువునా పాతుకుపోయివున్న ఆక్రోశం పెల్లుబికి బయటికి వచ్చేసింది. ఇన్నాళ్ళూ ఉగ్గబట్టుకున్న సహనం కసిగా పైకి ఉరికింది. ఒక అయిదు నిముషాలకు ఆమె మామూలు మనిషి అయి చూట్టూ పరికించి చూసేసరికి రక్తపు మడుగులో పడి వున్న రెండు దేహాలు కంటికి కనిపించి భయపెట్టాయి. అప్పుడు చలనమొచ్చింది ఆమెలో. ఒక్క క్షణం ఏమి చెయ్యాలో ఆలోచించి వడివడిగా ఇంటి తలుపులను తెరుచుకుని బయటికి వచ్చింది. అపుడపుడే కువైట్ పట్టణాన్ని ముసురుకుంటున్న ఆ సాయంత్రపు చీకట్లలో ఆమె కలిసిపోయింది.

అలా ఆ రాత్రంతా ఎడారి ఇసుకలో దారికి అడ్డం పడి నడిచి తెల్లవారేటప్పటికి కువైట్ పట్టణానికి దూరంగా వున్న ఒక చిన్న పల్లెటూరును చేరుకుంది చంద్రమ్మ. అక్కడ ఊరికి దూరంగా సముద్రపు ఒడ్డున ఉన్న ఒక గెస్ట్ హౌజ్ లో ఆమె చిన్నాన్న కొడుకు శంకర తోట మాలిగా పనిచేస్తున్నాడు. కువైటీ వాళ్ళు విడిదిగా ఉపయోగించుకునే ఆ ఇంటికి కువైటీ వాళ్ళు ఎపుడో సెలవురోజుల్లో తప్ప రోజూ రారు.

సముద్రపు ఒడ్డున దూరంగా అక్కడక్కడా విసిరేసినట్లున్న ఆ విడిది గృహాల్లో మనుష్య సంచారం తక్కువే.

అక్కడికి చేరుకోవడం ఎంతో కష్టమయినప్పటికీ ప్రాణాలు కాపాడుకోవడానికి అది ఆమెకు తప్పని పరిస్థితి.

మొదట ఆశ్రయమివ్వడానికి శంకర చాలా భయపడిపోయాడు.

"ఓమ్మే.. నీ కాళ్ళు పట్టుకుంటా ఇంకెక్కడికన్నా పో. వీళ్ళు పట్టుకున్నారంటే నీతో పాటూ నా ప్రాణం కూడా తీసి శవాలను ఆ అరేబియా సముద్రంలో పారేస్తారు. నా మాట విను" అంటూ ప్రాధేయపడ్డాడు.

చంద్రమ్మ శంకర కాళ్ళ మీద పడి పోయి "ఓన్నా.. ఈ పరాయి దేశంలో నువు తప్ప రక్షించే వాళ్ళు ఇంకెవ్వరూ

లేరు. నువ్వు కాదంటే అదిగో ఆ సముద్రంలో దూకి నీ కళ్ళముందే చచ్చిపోతాను" అంది ఏడుస్తూ.

పాపం ఆడకూతురు కష్టంలో వుంది ఒక అన్నగా నేను కాపాడకపోతే ఇంకెవరు కాపాడతారు. పోతే పోనీలే వెధవ ప్రాణం అనుకుని కరిగిపోయాడు శంకర. బయటి ముఖం చూడకుండా రొట్టె ముక్కలు తింటూ కొన్ని నెలలు అక్కడే నేల మాళిగ లోని ఒక సామాన్ల గదిలో కాలం గడిపింది చంద్రమ్మ. చట్టం కఠినంగా పనిచేసే కువైట్ లాంటి దేశంలో పోలీసుల కన్నుగప్పడం అసాధ్యమైన పని. కానీ మనిషికి కాలం తీరకపోతే ఆయుష్షనేది వుంటే అన్నీ సాధ్యమే అని చంద్రమ్మ కథ నిరూపించింది

తరువాత కువైట్ పోలీసులు చంద్రమ్మ కోసం నిర్విరామంగా వెతికారు. కానీ ఆమె అంతు ఎక్కడా కనబడలేదు. ఆనవాలూ చిక్కలేదు. సంవత్సరం తరువాత వీసాలూ పాస్పోర్టులూ లేని వారికి ఇండియా ఎంబసీ వాళ్ళు దయ దలచి పంపిన విమానంలో కూర్చుని ఆమె ఇండియాకు ప్రయాణం చేస్తోంది.

చంద్రమ్మ అదృష్టం బావుండి భూమి మీద ఇంకా నూకలుండబట్టి కువైట్ పోలీసుల కంటపడకుండా తప్పించుకోగలిగింది. బ్రతికి ఇండియా చేరి బట్ట కట్టుకోగలిగింది.

*(మరోకథ వచ్చేనెలలో)*

Post your comments